రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా!



ఖాళీ ప్రదేశంలో నిల్వ చేసిన గ్రావెల్ (ఫైల్)



గ్రావెల్ తవ్వకాలతో గుంతల మయంగా మారిన ఫార్మాసిటీ కాలనీ శ్మశానవాటిక

పరవాడ: మండలంలో గ్రావెల్ మాఫియా పేట్రేగిపోతోంది. పరవాడ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో భవన నిర్మాణాలు, పరిశ్రమలు, లేఅవుట్లు వెలుస్తున్నాయి. వీటి ఫిల్లింగ్ గ్రావెల్, మట్టికి విపరీతమైన గిరాకీ పెరిగింది. ఇదే అదునుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. నిషేధిత ప్రాంతాల్లో దొడ్డిదారిన గ్రావెల్ మట్టి తవ్వి రెండు చేతుల సొమ్ము చేసుకొంటున్నారు. డంపర్ గ్రావెల్ రూ.8 వేలు, లారీ రూ.5 వేలు, ట్రాక్టర్ గ్రావెల్‌ను రూ.2 వేలకు అమ్మకాలు జరిపి కాసులు కళ్ల జూస్తున్నారు. దీంతో అక్రమార్కులు కొండ బంజర్లు, చెరువులు కనిపిస్తే చాలు భారీ యంత్రాలను ఉపయోగించి రాత్రికి రాత్రి తవ్వకాలు జరిపి గ్రావెల్ తరలించుకుపోతున్నారు. పెదముషిడివాడ, ఈ. బోనంగి, తాడి, తానాం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, పి.బోనంగి, జేఎన్ ఫార్మాసిటీ ప్రాంతాల్లోని కొండ బంజర్లు, చెరువుల్లోని అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. చీకటి పడితే చాలు ముందుగా గుర్తించిన బంజర్లు, చెరువుల్లోకి భారీ యంత్రాలను తరలించి గ్రావెల్, మట్టి తవ్వకాలు చేసి రహస్య ప్రదేశాల్లో నిల్వ చేసి అధిక రేట్లు పలికినపుడు విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ సమీపంలోని కొండ బంజరులో రాత్రివేళ భారీ యంత్రాలతో గ్రావెల్ తవ్వి ఫార్మాసిటీ ప్రాంతంలో పలు రహస్య ప్రదేశాల్లో నిల్వ చేసి అమ్మకాలు జరిపి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ఫార్మాసిటీ కాలనీ, తాడి, పెదముషిడివాడ ప్రాంతాల్లో తవ్వకాలపై అధికారులు దృష్టి సారించక పోవడంతో ప్రభుత్వ ఖజానాకు భారీ గండి పడుతోంది. మండల పరిధిలో మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్న అక్రమ గ్రావెల్ దందాను అరికట్టడానికి అధికారులు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గ్రావెల్ తవ్వకాలు జరిపితే చర్యలు

అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవు. మండలంలోని ప్రభుత్వ స్థలాలు, చెరువుల్లో గ్రావెల్ తవ్వకాలు చేస్తే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకొంటాం. చాటుమాటుగా జరుగుతున్న గ్రావెల్, మట్టి తవ్వకాలపై గ్రామ రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేస్తాం. తవ్వకాలపై స్థానికులు తమ పరిధిలోని వీఆర్వోలకు, రెవెన్యూ అధికారులకు సమాచారం చేరవేస్తే తక్షణమే చర్యలు తీసుకొంటాం.

– వి.ప్రకాశరావు, తహసీల్దార్, పరవాడ

యాంత్రీకరణతో సాగు లాభదాయకం

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



రాయితీపై అందజేస్తున్న ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించడం ద్వారా లాభసాటిగా మార్చుకుని రైతులు అభివృద్ధి సాధించవచ్చని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. సబ్బవరం మండల వ్యవసాయ కేంద్రం వద్ద శుక్రవారం ప్రభుత్వం రాయితీపై అందించిన ట్రాక్టర్లను ఆయన ప్రారంభించారు. యాంత్రీకరణను ప్రోత్సహించడానికి ప్రభుత్వం మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల్లో 17 కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసిందని చెప్పారు. ఒక్కో సీహెచ్‌సీకి రూ.15 లక్షల విలువైన వ్యవసాయ యంత్రాలు, పరికరాలు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. దీనిలో 40 శాతం వరకూ ప్రభుత్వం రాయితీ ఇస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా మండలంలోని గుల్లేపల్లి, వంగలి గ్రామాలకు చెందిన శ్రీనివాస సీహెచ్‌సీ,సోమలింగేశ్వరస్వామి సీహెచ్‌సీ గ్రూపులకు ప్రభుత్వం రాయితీపై అందించిన రెండు ట్రాక్టర్లను ఆయన చేతులమీదుగా ప్రారంభించి అందజేశారు.ఇప్పటి వరకూ 10 ట్రాక్టర్లు రాయితీపై అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, గొర్లి ఉమా మహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి,శరగడం రాము,యడ్ల నాయుడు,గవర రాజు,మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, ఏఈవో బాలరాజు, కేవీ సత్యనారాయణతదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహా భాగ్యం



వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న చిన్నారులతో వైద్యులు

సింహాచలం: ఆరోగ్యమే మహాభాగ్యం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అడవివరం ఆరోగ్యకేంద్రం హౌస్ సర్జన్లు విద్యార్థులకు సూచించారు. అడవివరం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విజ్ఞానం, వినోదంతో పాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని సూచించారు. డాక్టర్ కందుల విజయ్ వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మంచినీరు,మజ్జిగ,ఓఆర్ఎస్ ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. డాక్టర్ రేణుక మాట్లాడుతూ ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చినా వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. డాక్టర్ కనకం వందన మాట్లాడుతూ విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ లక్ష్మీనరసమ్మ, విశ్రాంత్ సబ్ ఇన్‌స్పెక్టర్ సన్యాసిరావు, గ్రంథాలయ అధికారి ఎన్.వి.నరసింహం, రీడర్స్‌ఫోరం కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీపీ-1 పద్మజ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన స్పందనలో అనధికార, అక్రమ నిర్మాణాలపైనే ఫిర్యాదులు అందాయి. స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించినట్టు కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎటువంటి అనధికార నిర్మాణాలు చేపట్టినా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా సమస్య తెలపవచ్చు. లేదా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోన్ నంబరు 8187897569కు తెలిపి పూర్తి వివరాలు (డోరు నంబరు, వార్డు నంబరు, చిరునామా, సమస్య వివరాలు) వాట్సప్‌కు పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారాపై అధికారులకు నివేదించి, ఆ సమస్య సత్వర చర్యలు చేపట్టనున్నట్టు ప్రధాన సిటీ ప్లానర్ బి. సురేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్‌పై స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జోన్-2 నుంచి ఒకటి, జోన్-3 నుంచి రెండు, జోన్-4 నుంచి ఒకటి, జోన్-5 నుంచి రెండు, జోన్-6 నుంచి ఒకటి, జోన్-7 నుంచి ఒకటి, జోన్-8 నుంచి ఒక ఫిర్యాదు వచ్చింది. సిటీ ప్లానర్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో డీసీపీ-1 కె. పద్మజ స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన సిటీ ప్లానర్ మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరుతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సప్ నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూపీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అగనంపూడి ఆస్పత్రికి గుర్తింపు

అగనంపూడి : దివ్యాంగులకు సేవలు, సదరం క్యాంప్‌ల నిర్వహణ, ధ్రువపత్రాల జారీలో అగనంపూడి ఏరియా ఆస్పత్రికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చింది. గురువారం నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఉన్నతాధికారులు ఆస్పత్రి సిబ్బందిని, ఆర్థోపెడిక్ విభాగాన్ని ప్రశంసించినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉష శుక్రవారం తెలిపారు.

ప్రజలకు ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ఉత్తమ వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ వలంటీర్లు



వలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా వలంటీర్లు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీడీవో రమేష్ నాయుడు అధ్యక్షతన నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి పర్యటనలకు గ్రామాల్లోకి వెళ్తున్నప్పుడు ప్రజలంతా గౌరవంగా ఆదరిస్తున్నారంటే దానికి కారణం వలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేయడమేనని చెప్పారు.ప్రతి వలంటీర్‌కు తమ క్లస్టర్ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్తున్నప్పుడు గత టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పరిస్థితులు,నేటి పరిస్థితులను వివరించాలని సూచించారు.

టీడీపీ హయాంలో దోపిడీ

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను తీవ్ర దోపిడీ చేశారన్నారు. వీటన్నింటినీ చూసి చలించిపోయిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ప్రజా సేవలను పారదర్శకంగా ప్రజలకు అందించేందుకు వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చారన్నారు. ఈ వ్యవస్థ ఏర్పాటులో అనేక సవాళ్లు ఎదురైనా సీఎం వైఎస్ జగన్ వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి బలోపేతం చేశారన్నారు. ఇప్పటి వరకూ ప్రజా ప్రతినిధులు, అధికారులను సన్మానించాలని చెప్పని ఆయన వలంటీర్లను గౌరవించి సన్మానించమని చెప్పడం ఆయన మహోన్నత వ్యక్తిత్వానికి నిదర్శమని తెలిపారు.

339 మంది పురస్కారాలు

మండంలోని 339 మంది వలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న,సేవా మిత్ర పురస్కారాలతో సత్కరించి ప్రశంసా పత్రాలు,మెడల్ అందజేశారు. సేవా వజ్ర పురస్కారం అందుకున్న ఇద్దరికి రూ.30 వేలు చొప్పున, సేవా రత్న అందుకున్న ఐదుగురికి రూ.20 వేల చొప్పున, 332 మందికి సేవా మిత్ర పురస్కారాలు వరించడంతో రూ.10 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, కొటాన రాము,పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, తహసీల్దార్ బి. సత్యనారాయణ,మాజీ ఎంపీపీలు సబ్బవరపు ముత్యాలనాయుడు, గొర్లి ఉమా మహేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు,పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,శరగడం రాము,మోపాడ అప్పారావు,సబ్బవరపు నారాయణమూర్తి,వనం అచ్చెంనాయుడు,రాపేటి రాము, వడ్డాది అప్పలరాజు,ఈవోఆర్‌డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనితకు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 88వ వార్డు యాదవజగ్గరాజుపేటలో భూములు కోల్పోయిన ఏపీఐఐసీ నిర్వాసితుల జాబితాను పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోరుతూ శుక్రవారం ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనితను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. గతంలో ఎమ్మెల్యే కృషి వల్ల తహసీల్దార్ ఆఫీస్ నుండి అవార్డు కాపీల వెరిఫికేషన్ ప్రారంభమైందని, పేర్లు లేని నిర్వాసితులు కొంతమంది ఉన్నారని, ఇచ్చిన పేర్లు కూడా తప్పుగా ఉండడంతో నిర్వాసితులు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు నిర్వాసితుల జాబితాను పూర్తిస్థాయిలో పరిశీలించి, సమస్యలు పరిష్కరించాలని కోరారు. భూములు కోల్పోయిన వారి అవార్డు కాపీలు తెప్పించి, పరిశీలన చేసి వీలైనంత త్వరగా భూసమస్యను పరిష్కరించాలని విన్నవించారు. నమ్మి శ్రీనివాస్‌ప్రసాద్, మాడిస అప్పలరాజు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి'



834వ రోజు దీక్ష శిబిరంలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరిగిందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 834వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగ కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని పరిశ్రమల వద్ద దేశవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి ప్రజామోదం లేదనేందుకు ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతే నిదర్శనమని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని పార్లమెంట్‌లో ప్రకటన చేసే వరకు తమ ఉద్యమాలు ఆగవన్నారు.

సమావేశాలకు రాకుంటే ఎలా

- పరీక్షలపై నిర్లక్ష్యం తగదు
- గైర్హాజరైన అధికారులపై ఆర్జేడీ ఆగ్రహం
- 6గురు సీఎస్, 18 డీవోలకు మెమోలు జారీ చేయాలని ఆదేశం



మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతి కుమారి

విశాఖ విద్య: పదో తరగతి సప్లిమెంటరీ (అడ్వాన్స్‌డ్) పరీక్షల సన్నద్ధతపై నిర్వహించే సమావేశాలకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు గైర్హాజరు కావడం తీవ్రంగా పరిగణించాల్సిందేనని విద్యాశాఖ ఆర్జేడీ జ్యోతి కుమారి అన్నారు. శుక్రవారం డీఈవో కార్యాలయంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు జూన్ 2 నుంచి ప్రారంభమయ్యే అడ్వాన్స్‌డ్ పరీక్షలపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణలో ఎలా వ్యవహరించాలనే దానిపై చర్చించారు. అయితే కీలకమైన సమావేశానికి పలువురు సీఎస్, డీవోలు గైర్హాజరయ్యారు. పదో తరగతి అడ్వాన్స్‌డ్ పరీక్షలకు జిల్లాలో 5,981 మంది హాజరౌతుండగా, వీరి కోసమని 24 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతీ కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించారు. అయితే శుక్రవారం నాటి సమీక్ష సమావేశానికి సీఎస్‌లు 24 మందికి గాను 18 మంది, డిపార్ట్‌మెంట్ అధికారులు కేవలం 6 గురు మాత్రమే వచ్చారు. దీనిపై ఆర్జేడీ జ్యోతి కుమారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గైర్హాజరైన వారందరికీ మెమోలు జారీ చేసి, వారి నుంచే వచ్చే సంజాయిషీ వివరాలను కూడా తనకు నివేదించాలన్నారు. డీఈవో జి. లక్ష్మణరావు, పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మురళీ మోహన్, డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్, సిబ్బంది భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మీదేవి, దుర్గమాంబలకు ప్రత్యేక పూజలు



ధనలక్ష్మీదేవికి

కంచరపాలెం: గొల్లకంచరపాలెంలోని ధనలక్ష్మీదేవి ఆలయం, దుర్గానగర్‌లోని దుర్గమాంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ధనలక్ష్మీదేవికి ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామాచార్యులు, దుర్గమాంబకు ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ కుంకుమ పూజలు, పూల, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం హారతి సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయాల కమిటీల సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

త్వరితగతిన టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులు



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు

ఆనందపురం : నిర్మాణ పనులు పూర్తి అయిన టిడ్కో ఇళ్లకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీడీఎంఏ, జిల్లా ప్రత్యేకాధికారి పి.కోటేశ్వరరావు సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని దబ్బందలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దబ్బందలో 1920 ఇళ్ల నిర్మాణానికి పనులు ప్రారంభించగా, 1728 ఇళ్ల పనులు పూర్తయినట్టు వెల్లడించారు. మిగిలిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. పూర్తయిన బ్లాకుల వద్ద బీటి రోడ్లు, కాలువలు, వంతెనలు, విద్యుత్, భూగర్భ డ్రైనేజి వ్యవస్థలతో పాటు ఓవర్ హెడ్ ట్యాంక్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, బ్యాంక్ రుణ సదుపాయాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వీటిని ప్రారంభించేందుకు అవకాశాలున్నాయని, పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో అమలవుతోన్న అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. వెల్లంకిలో అంగన్‌వాడీ కేంద్రం, రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. గుడిలోవలో జరుగుతున్న భూ రీసర్వేను, లొడగలవానిపాలెంలో జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడు, డీపీవో చక్రవర్తి, కార్యనిర్వాహక ఇంజినీరు సుధాకర్ పాల్గొన్నారు.

విశాఖలో ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం పర్యటన



విశాఖ రైల్వే స్టేషన్‌లో జీఎం మనోజ్‌శర్మ, డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి, అధికారులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ శుక్రవారం విశాఖలో పర్యటించారు. డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతితో కలిసి విశాఖ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వాల్తేర్ డివిజన్ ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడి, వివిధ విషయాలపై వారి నుంచి సూచనలు సలహాలు తీసుకున్నారు. స్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా జ్ఞానాపురం వైపు జరుగుతున్న పనులను జీఎం పరిశీలించారు. ఈ పనులపై గతిశక్తి ప్రాజెక్టు అధికారులతో కలిసి సమీక్షించారు. సెల్ఫ్ ప్రొపెల్డ్ ఇన్‌స్పెక్షన్ కార్‌లో జీఎం మనోజ్ శర్మ మార్షలింగ్ యార్డ్, కోచింగ్ యార్డ్, గోపాలపట్నం యార్డ్, సింహాచలం నార్త్ యార్డ్ వంటి కీలక ప్రాంతాలను పర్యటించారు. అనంతరం వైజాగ్ స్టీల్ ప్లాంట్ రైల్వే సైడింగ్‌ను పరీక్షించారు. స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌తో సమావేశమై పలు మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చించారు. అదాని గంగవరం పోర్టు అధికారులతో జీఎం సమావేశమయ్యారు. చివరిగా దువ్వాడ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులను జీఎం పరిశీలించారు. పర్యటనలో పలువురు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి



ముత్తంశెట్టికి ప్రసాదం అందజేస్తున్న ఈఈ శ్రీనివాసరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దేవస్థానం ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు స్వామివారి శేషవస్త్రం... దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రిటైర్డ్ ఉద్యోగులు దేవస్థానం ఉద్యోగుల రిటైర్డ్ వయోపరిమితిని 62ఏళ్లు పెంచేందుకు కృషి చేయాలని ముత్తంశెట్టికి వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిరిపురపు మహేష్ తదితరులు ఉన్నారు.

పూర్వి రాజక్‌ను అభినందించిన కలెక్టర్



పూర్వి రాజక్‌ను అభినందిస్తున్న కలెక్టర్

మహారాణిపేట : విశాఖకు చెందిన పూర్వి రాజక్‌ను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సూపర్ టాలెంటెడ్ కిడ్-2023గా ప్రకటించింది. దీంతో శుక్రవారం పూర్వి రాజక్ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిసింది. కలెక్టర్ పూర్వి రాజక్‌ను అభినందించారు. 12 సంవత్సరాల వయస్సు గల పూర్వి రాజక్ కళ, సాహిత్యం, క్రీడా రంగాల్లో తనదైన ముద్ర వేసింది. ఆమె తన మూడు సంవత్సరాల వయసులో మొదటి అవార్డు గెలుచుకుంది. అనంతరం మల్టీ టాలెంటెడ్ గర్ల్‌గా అనేక అవార్డులు గెలుచుకుంది. స్కూలు, ఇంటర్ స్కూలు, డిస్ట్రిక్ట్, స్టేట్, నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయిలో ఆర్ట్, కరాటే, ఎలక్ట్రికల్ రంగాల్లో 300 కంటే ఎక్కువ అవార్డులు, బహుమతులు గెలుచుకుంది. ఈమె పేరును ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్-2022లో నమోదు చేసింది. రచయిత్రి, కళాకారిణి, కవయిత్రి, వక్త, కరాటే నిపుణురాలు, సామాజిక కార్యకర్తగా విజయాలు సాధించి బంగారు పతక విజేతగా నిలిచింది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ రమేష్

సింహాచలం: ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితమైన ప్రయాణం సాగించాలని పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ ఆటోడ్రైవర్లు, వాహనదారులకు సూచించారు. పెందుర్తిలో శుక్రవారం ఆయన ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నియమావళిపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాన్ని నడపడం ప్రమాదకరమని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.